

## భద్రం... భద్రం...



**వెరివోకినా...** ప్రపంచంలోనే లోతైన గుహగా పేరు పొందింది. 7,293 అడుగులు దాని రికార్డు. అదొక్కటే ప్రత్యేకత అయితే ఇప్పుడు దీని గురించి మాట్లాడుకోనక్కర్లేదు. అంతకు మించి ప్రమాదం పొంచి ఉండే చోటిది. 2018 సంవత్సరం... ఈ గుహ అడుగు భాగంలో కొందరు అన్వేషకులు ఆహారం తింటున్నారు. పై నుంచి ప్రమాద ఘంటిక... భారీ వర్షం కారణంగా ఉద్ధృతంగా వరద ముంచుకొస్తున్నది అక్కడ. దానికి ఎదురీది పైకొచ్చే ప్రయత్నం చేశారు అందులోని సభ్యులంతా. ముందుగా కనిపెట్టడమో, ఒకరికొకరు సాయం చేసుకోవడమో... మొత్తానికి అందరూ ప్రాణాలతో బయటపడ్డారు. అయితే ప్రతిసారీ ఇలా జరగదు. 2020లో సెర్గీ కొజీవ్ అనే ఔత్సాహికుడు ఒంటరిగా దీని లోతుల్ని చూసే ప్రయత్నం చేశాడు. దాదాపు తొమ్మిది నెలల తర్వాత, ఆ గుహను చూసేందుకు లోపలికి దిగిన ఓ బృందం నేల మట్టానికి మైలు దూరంలో తాడుకు వేలాడుతున్న అతని శవాన్ని గుర్తించే దాకా ఆ వ్యక్తి చనిపోయాడని కూడా ఎవరికీ తెలియలేదు. అతని దేహాన్ని బయటికి తీయడానికి 100 మంది వాలంటీర్లు కష్టపడాల్సి వచ్చిందంటే ఆ ప్రాంతం ఎంత భయంకరమైనదో అంచనా వేయవచ్చు. అతనొక్కడే కాదు, ఇక్కడ పోయిన ప్రాణాలు చాలానే ఉన్నాయి. అతి శీతల ఉష్ణోగ్రతలు, చెమ్మ, చీకటి, కప్పులు కూలిపోవడం, దారులు తెలియకపోవడం లాంటి అనేక ప్రమాదాలు ఇక్కడ పొంచి ఉంటాయి. అయినా సరే, వీటన్నింటినీ అధిగమిస్తూ సాహసయాత్రలు చేస్తుంటారు కొందరు ధైర్యవంతులు.

## పట్టు తప్పితే పరలోకమే...





**సొరంగాలంటే** ఏటవాలుగా ఉండేవే కాదు ఎవరో బోర్‌వేసి డ్రిల్ చేసినట్టు నిటారుగా లోతైనవీ ఉంటాయి. అలాంటి వాటిలో అమ్మో అనిపించే గుహ స్పెయిన్‌లోని 'సిమా డి లా కార్నిసా'. అక్కడి పికోస్ డి యూరోపా అనే పర్వత శ్రేణిలో ఈ గుహ అంతర్భాగంగా ఉంటుంది. 4,944 అడుగులు దీని లోతు. కాబట్టి ఒక్క అడుగు పొరపాటుగా వేసినా, పట్టు కోసం వేసుకునే తాడు ఏమాత్రం తెగినా నేరుగా పాతాళానికే పడిపోతాం అన్నమాట. అందుకే ప్రపంచంలోనే ప్రమాదకరమైన గుహల్లో ఇదీ ఒకటిగా పేరు పొందింది. ఈ ప్రాంతంలో నివసించిన పురాతన మానవ జాతికి సంబంధించిన 28 అస్థిపంజరాలు ఆ మధ్య ఇక్కడ బయటపడ్డాయి. అయితే ఇవి ఇక్కడికి ఎలా వచ్చాయి అన్న విషయాన్ని స్పష్టంగా కనిపెట్టలేకపోతున్నారు. ఏది ఏమైనా ఇందులో అడుగు పెట్టాలంటే అప్రమత్తత అత్యావశ్యకమే!

## గుహలోనే నది...



**గుహలంటే** నడిచి వెళ్లేవే మనకు తెలుసు. కానీ ఫిలీప్పీన్స్‌లోని 'పుయెటో ప్రిన్సెసా సబ్‌టెర్రెనియన్ గుహ' ఇందుకు భిన్నమైనది. అంతే ప్రమాదకరమైనది కూడా. ఎందుకంటే ఈ గుహలో ఓ నది ఉంటుంది. దాని పేరు సెయింట్ పాల్ అండర్ గ్రౌండ్ రివర్. కాబట్టి ఈ గుహలు చూడాలంటే పడవలో వెళ్లాల్సిందే. ఇక్కడి పురాతనమైన లైమ్ స్టోన్ సొరంగాల గుండా విద్యుద్దీపాల కాంతిలో ఎనిమిది కిలోమీటర్ల దూరానికి పైగా ప్రయాణిస్తాం. ఇందులోని విచిత్రం ఏంటంటే మనం గుహలోకి నది ద్వారా ప్రవేశించి బయటికి వచ్చేప్పటికి దక్షిణ చైనా సముద్రంలో తేలుతాం. ఈ సొరంగం నేరుగా సముద్రంలోకి దారి తీస్తుంది కాబట్టి అలల ఆటు పోటులను బట్టి అప్రమత్తంగా ప్రయాణం సాగించాల్సి ఉంటుంది. లేకపోతే పడవలు తలకిందులయ్యే ప్రమాదం ఉంది. ప్రకృతి వింత అయిన ఈ ప్రదేశాన్ని ఐక్యరాజ్య సమితి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది.



## గుణ గుహలంటే.. గుండె గుబేల్!




**తమిళనాడు రాష్ట్రం** కొడైకెనాల్‌లోని డెవిల్స్ కిచెన్ కేవ్స్‌ని... కమల్‌హాసన్ చిత్రం 'గుణ'లో చూపించారు. ఆ సినిమా ద్వారా ప్రాచుర్యంలోకి వచ్చాయి కనుక వీటిని గుణ కేవ్స్‌గానూ పిలుస్తారు. ఇక, మహాభారత కాలంలో పాండవులు ఈ గుహల్లోనే వంట చేసుకున్నారని స్థానికుల విశ్వాసం. అందువల్ల దీనికి కిచెన్ అనే పేరు వస్తే, లోపలి ప్రదేశాలు చీకటిగా గబ్బిలాలతో నిండి ఉండటం వల్ల డెవిల్ అనే పేరూ జతయ్యింది. నేల మట్టానికి 2,230 అడుగుల ఎత్తులో షోలా అడవుల మధ్య, సహజ సిద్ధంగా ఏర్పడ్డ నిలువు రాళ్లతో ఈ ప్రాంతం ప్రకృతి సౌందర్యానికి ఆలవాలంగా ఉంటుంది. అయితే లోపలి చల్లదనం, చీకటిగా ఉండే గదుల్లాంటి ప్రదేశాలు సాహసయాత్రికులను ఆకర్షిస్తుంటాయి. 2016 నాటికి పోలీసుల లెక్కల ప్రకారం ఇక్కడి ఒక లోతైన రంధ్రంలో పడి 16 మందికి పైగా మరణించారు. కనీసం వాళ్ల మృతదేహాలు కూడా ఇప్పటి దాకా దొరకలేదు. దీంతో ఈ గుహ అంటేనే అపాయానికి అడ్రెస్‌లా మారిపోయింది. ఇక, 2006లో మాత్రం స్నేహితులతో కలిసి వెళ్లి ప్రమాదవశాత్తూ ఇందులో పడిన వ్యక్తి తిరిగి రావడం... ఇటీవలి 'మంజుమ్మల్ బాయ్స్' సినిమాకు స్ఫూర్తి అయింది.